క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్స్‌పాల్ ఇందిరాప్రియదర్శిని

క్రోసూరు: క్రోసూరు కేజీబీవీలో ఆరవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ (గ్రూప్)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఇందిరాప్రియదర్శిని మంగళవారం తెలిపారు. ఆరవ తరగతికి 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌కు 40 సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు http// apkgbv. apcfss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, అనాథలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు, దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



అచ్చంపేట: మండలంలోని పెదపాలెం పాల ఉత్పత్తిదారుల సంఘ సభ్యులైన రామిశెట్టి అనంతరామమ్మ ఈ ఏడాది ఫిబ్రవరి 7న అనారోగ్య కారణంగా మృతి చెందారు. సంఘంలో పాలుపోసే పాల ఉత్పత్తిదారుల సహజ మరణానికి ఇచ్చే రు.60వేల చెక్కును సంఘ కార్యదర్శి చిరుమామిళ్ల నరసింహారావు మంగళవారం మృతురాలి వారసుడు మల్లికార్జున్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు సంగం డెయిరీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రెంటపాళ్ల బీఎంసీ ఇన్‌చార్జ్ టి.గోపి, సూపర్‌వైజర్ నరేష్, సంఘ సభ్యులు, పాలఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



నకరికల్లు: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు లుక్ కల్చర్ మీడియా లిమిటెట్ స్వచ్ఛంద సంస్థ టీమ్ లీడర్ షేక్ అబ్దుల్ తెలిపారు. లుక్ కల్చర్ మీడియా లిమిటెట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నకరికల్లులోని పేద ముస్లింలకు మంగళవారం రంజాన్ తోఫా రూపంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంతో జరుపుకోవాలని తమ వంతుగా తోఫా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ ఫారూక్, షేక్ సిలార్, షేక్ ముస్తాక్, భవాని తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

పెదకూరపాడు: వ్యర్థాలకు అడ్డాగా వైద్యశాల రోడ్డు శీర్షికతో ఈ నెల 25న సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పారిశుద్ధ్య కార్మికులతో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆసుపత్రి రోడ్డులో ఉన్న ఖాళీ కొబ్బరి బొండాలు.. పశువుల వ్యర్థాలను, చెత్తను తొలగింపజేశారు. దీంతో స్థానికులు, సామాజిక ఆరోగ్య సిబ్బంది, రోగులు హర్షం వ్యక్తం చేశారు. సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రుణ అర్హత మేళా

రెంటచింతల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం క్రెడిట్ క్యాంప్(రుణ అర్హత మేళా)ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె. సరోజినిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంబంధించి ఎంఎస్ఎంఈ కింద స్వయం ఉపాధిలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు ఈ క్రెడిట్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్న ఈ రుణ అర్హత మేళాలో మండల పరిధిలోని వివిధ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు (సెలక్షన్ కమిటీ సభ్యులు), గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు. ఆన్‌లైన్‌లో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారు యావత్తు పత్రాలు రెండు సెట్లు ప్రింట్ తీసుకుని హాజరు కావాలన్నారు.

పారుపల్లి @ సమస్యలు



పారుపల్లి - ఎర్రబాలెం ఆర్ అండ్ బీ రహదారి దుస్థితి



పారుపల్లి - పీసపాడు మట్టి రోడ్డు

- సమస్యలతో సతమతమవుతున్న పారుపల్లి
- తాగునీరు, రహదారి, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామం
- గ్రామ జనాభా 550 మంది

క్రోసూరు: మండలంలోని పారుపల్లి గ్రామం పలు సమస్యలతో సతమతవుతుంది. మండలంలోని పీసపాడు గ్రామానికి అనుబంధ గ్రామంగా ఉన్న పారుపల్లి గ్రామం అగ్రహారాల గ్రామం. జనాభా 550 మంది ఉంటారు. గ్రామానికి రక్షిత తాగునీరు లేదు, సరియైన రహదారి లేదు, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు, పారుపల్లి గ్రామం ప్రధాన రహదారికి.. పీసపాడు, ఎర్రబాలెం రెండు వైపుల నుంచి చేరుకునేందుకు సుమారు 4 కిలోమీటర్లు. గ్రామానికి చేరుకునేందుకు రెండు రహదారులున్నాయి. ఒకటి క్రోసూరు-సత్తెనపల్లి ప్రధాన రహదారిపై ఉన్న ఎర్రబాలెం గ్రామం నుంచి, అదే విధంగా మండలంలోని పీసపాడు గ్రామం నుంచి పారుపల్లి చేరుకునేందుకు రెండవ మార్గం. ఎక్కువగా పీసపాడు ప్రధాన రహదారి మీదుగా ప్రజలు గ్రామానికి చేరుకుంటారు.

సరైన రహదారి లేదు

ఎర్రబాలెం గ్రామం నుంచి ఏళ్ల క్రితం ఆర్ అండ్ బీ శాఖ బీటీ రోడ్డు వేయటం జరిగింది. అది ప్రస్తుతం పూర్తిగా పాడైంది. అదేవిధంగా పీసపాడు నుంచి పారుపల్లి వెళ్లేందుకు మట్టి రోడ్డు మార్గం ఉంది. గ్రామస్తులు అటుగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు, నడిచి వెళ్లటమే కానీ సరైన రహదారి లేదు. వర్షాకాలంలో రాకపోకలు సాగించాలంటే మరింత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

ఆర్టీసీ బస్సు లేదు

ఏళ్ల తరబడిగా గ్రామానికి చేరుకునేందుకు ప్రైవేటు వాహనాలే దిక్కు. రాత్రి సమయంలో ఏదైనా ఆరోగ్య సమస్యలొస్తే మరిన్ని అవస్థలు పడాల్సిందే. ఆర్టీసీ బస్సులు తిరగని దుస్థితి.

తాగునీరు లేదు

గ్రామంలో ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా పైపులైనులు వేసినా ఇప్పటి వరకు నీటి సరఫరా జరగలేదు. దీంతో వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకు పక్కగా బోరు పంపు వేసి ట్యాంకుకు నీటిని ఎక్కించి గ్రామంలోని ట్యాపులకు సరఫరా చేయాలన్నా పైపులైన్లు పూడుకుపోయి నీరు సరఫరా లేదు. బజారుల్లో ఉన్న బోర్లు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. అధికారులు జోక్యం చేసుకుని తగు విధంగా ప్రజల సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

రెండు ట్రిప్పులైనా బస్సు పెట్టండి



మా గ్రామం నుంచి పాఠశాలలకు, ఉన్నత చదవులకు వెళ్లే వారు, ఆసుపత్రులకు వెళ్లే వారు వాహనాల ద్వారా వెళ్లాల్సి వస్తుంది. ఆర్టీసీ బస్సు రోజుకు రెండు ట్రిప్పులైనా తిప్పితే ఇబ్బందులు తొలగుతాయి.

– యనబర్ల మంగమ్మ, పారుపల్లి

కుళాయి అన్నారు



మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి అన్నారు. పైపులు వేసారు. ట్యాంకు కట్టారు, నీళ్ల మాత్రం సరఫరా కావటం లేదు. అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.

– కె.రాజు, పారుపల్లి

అవస్థలు పడుతున్నాం



గ్రామం నుంచి ఎర్రబాలెం వరకు గల తారురోడ్డు పాడై ఏళ్లు గడుస్తుంది. పీసపాడు వైపు వెళ్లే రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో నడిచేందుకు వీలుపడక అవస్థలు పడుతున్నాం. గ్రామానికి మంచి రోడ్డు సౌకర్యం కల్పించండి.

– పారుపల్లి రామారావు, పారుపల్లి

విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన ఉద్యోగి రామకృష్ణ



పెదకూరపాడులో రామకృష్ణను బహుమానంతో సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదకూరపాడు: ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను అ మండల ప్రజలు మరువరని ఇన్‌చార్జి ఎంపీడీవో సోమయాజులు అన్నారు. పెదకూరపాడు ఎంపీడీవో రామకృష్ణ విధి నిర్వహణలో భాగంగా బాపట్ల ట్రెనింగ్ సెంటర్‌కు గెజిటెడ్ ఫ్యాకల్టీగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం పెదకూరపాడులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సోమయాజులు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం కాకుమాను మండలం నుంచి బదిలీపై పెదకూరపాడు వచ్చిన రామకృష్ణ అనతి కాలంలో మండల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య, తాగునీటి సమస్యల పరిష్కారానికి విశేష సేవలు అందించారని పలువురు కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బొబ్బా సునీత, ఏపీవో కోటేశ్వరరావు, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, మందా ఫ్రాన్సిస్ తదితరులు ఎంపీడీవో రామకృష్ణను సత్కరించారు.

సత్తెనపల్లిలో డయల్ యువర్ డీఎం



డయల్ యువర్ డీఎంలో సమస్యలు వింటున్న డీఎం జీఎస్‌వీవీ కుమార్

సత్తెనపల్లి: డయల్ యువర్ డీఎంకు ఆర్టీసీ ప్రయాణికుల నుంచి ఏడు సమస్యలు వచ్చినట్లు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. దీనిలో భాగంగా సత్తెనపల్లిలోని నరసరావుపేట పాయింట్ వద్ద బస్‌కి బస్‌కి మధ్య గ్యాప్‌లో ఆటోలు ఆపి ప్రయాణికులను ఎక్కించుకొని పోతున్నారని, అలా కాకుండా చూడాలని సత్తెనపల్లి నుంచి ప్రయాణికుడు ప్రభాకర్ కోరగా... ఆ పాయింట్‌లో కంట్రోలర్‌ను పెట్టి బస్సు వచ్చిన పిదప బస్సులు పంపించే ఏర్పాటు చేస్తామని, ఆటోల విషయంపై సత్తెనపల్లి డీఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చామన్నారు. సత్తెనపల్లి నుంచి హైదరాబాద్‌కి కొత్త బస్సు కావాలని సత్తెనపల్లికి చెందిన ఎస్.శివ శంకర ప్రసాద్, అనీలు వేర్వేరుగా కోరగా కొత్త బస్సు కోసం ఉన్నతాధికారులకు తెలియపరిచి నిర్ణయం తీసుకుంటామని డీఎం సమాధానం ఇచ్చారు. పెదకూరపాడు బస్టాండ్‌లో ఫ్యాన్లు, టైమింగ్ బోర్డులు కావాలని, బస్టాండ్‌లో ఉన్న పోస్టర్లను తీసివేయాలని పెదకూరపాడుకు చెందిన హనుమయ్య కోరగా రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తామని, పోస్టర్లను తీసివేస్తామని డీఎం తెలిపారు. సత్తెనపల్లి నుంచి గుంటూరుకు వయా పేరేచర్ల, పలకలూరు మీదుగా బస్సు సౌకర్యం కావాలని గుంటూరుకు చెందిన మహేష్ కోరగా గతంలో ఈ విధంగా బస్సులను నడిపామని.. ఆదరణ లేనందున రద్దు చేశామని, ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. అమరావతి నుంచి సత్తెనపల్లి మీదుగా శ్రీశైలంకు బస్సు నడపాలని సత్తెనపల్లికి చెందిన హనుమంతరావు కోరగా దీనిపై ఉన్నతాధికారులకు తెలియపరచి పరిష్కరిస్తామన్నారు. క్రోసూరు మండలం 88 తాళ్లూరు నుంచి సత్తెనపల్లికి ప్రస్తుతం ఉదయం, సాయంత్రం ట్రిప్పు కాకుండా మధ్యలో అదనంగా ఒక ట్రిప్పు కావాలని 88 తాళ్లూరుకు చెందిన షేక్ ఖాజా హుస్సేన్ కోరగా.. మధ్యలో ట్రిప్పు విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించి చేయగలమని డీఎం కుమార్ సమాధానం ఇచ్చారు.

కంప్యూటరీకరణ ద్వారా సంఘాల లావాదేవీలు పారదర్శకం



మాట్లాడుతున్న సంఘ పర్సన్ ఇన్‌చార్జి ఎంవీ నరసయ్య

సత్తెనపల్లి: కంప్యూటరీకరణ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలు జరపడం వలన మరింత పారదర్శకత చేకూరుతుందని సంఘ పర్సన్ ఇన్‌చార్జి ఎంవీ నరసయ్య అన్నారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో సంఘ సభ్యులకు కంప్యూటరీకరణపై అవగాహన కల్పించేందుకు సెమినార్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికత ఉపయోగించి సంఘాల నిర్వహణను సమర్థవంతంగా చేసుకునే మార్గాలను వివరించారు. సభ్యులు నేటి ఆధునిక వ్యవస్థలతో అనుసంధానం అవ్వడం ఎంతో ప్రయోజనకరమన్నారు. ముఖ్యంగా లెక్కల నిర్వహణ, డేటా భద్రత, ఆన్‌లైన్ లావాదేవీలు వంటి అంశాలపై చర్చించారు. సంఘ సీఈవో అన్నదాత సాయిబాబు మాట్లాడుతూ సంఘాల డిజిటలైజేషన్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు మార్గదర్శనం చేసి సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణ, దాతృత్వాలకు ప్రతీక రంజాన్

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి



ఇఫ్తార్ విందులో డాక్టర్ సుధీర్‌భార్గవ్ రెడ్డి

సత్తెనపల్లి: క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతనలకు ప్రతీకగా ముస్లింలు రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని పట్టణంలోని 6వ వార్డులో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు గుంటూరు జానీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంగళవారం రాత్రి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్య ఖురాన్ గ్రంథం ఏర్పడిన రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదిగా ముస్లింలు భావిస్తారని తెలిపారు. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసి రంజాన్ పర్వదినం రోజున విశేషంగా ప్రార్థనలు చేయడంతో పాటు సంపాదించిన మొత్తంలో కొంత దానధర్మాలకు వినియోగించి దాతృత్వం చాటుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమని చెప్పారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందులో భాగంగా ఆహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన గుంటూరు జానీని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నకరికల్లు మండల పార్టీ అధ్యక్షుడు భవనం రాఘవరెడ్డి, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జై బూన్‌బీఈసా, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు, జూపల్లి పాల్, పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు ఉన్నారు.

28న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ మంగళవారం తెలిపారు. సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించటం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫీషియో హోదాలో స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని ఆయన కోరారు.

పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి విరాళం

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన అనుముల కృష్ణ చైతన్య, సాయి స్వప్న వివాహం సందర్భంగా అభ్యుదయ భావాల నిలయమైన పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి విరాళం అందించేందుకు ముందుకు వచ్చారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ కామ్రేడ్ గద్దె చలమయ్య ట్రస్టు సభ్యులు కామ్రేడ్ ఆంజనేయులు నాయక్‌లను మంగళవారం కలుసుకొని రూ.50 వేలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు గద్దె చలమయ్య ట్రస్ట్ కమిటీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపు ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు

రాజుపాలెం: మండలంలోని ఐదు గ్రామాలలో ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజుపాలెం, కొత్తబోధనం, అనుపాలెం, అంచులవారిపాలెం, ఉప్పలపాడు గ్రామాలలో ఉప సర్పంచ్ పదవులు ఖాళీగా ఉన్నందున ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాలలో ఎన్నికల అధికారి ఎన్నిక నిర్వహిస్తారని అన్నారు. ఆయా గ్రామాల వార్డు సభ్యులు అందరు పాల్గొనాలని సూచించారు.

గాలికుంటు టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నకరికల్లు: పశువులలో గాలికుంటు నివారణకు చేపడుతున్న టీకా కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కె.కాంతారావు సూచించారు. నకరికల్లులో గాలికుంటు టీకా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీకా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఇళ్ల వద్దకే వచ్చి చేపడుతున్న జాతీయ టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నకరికల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.వెంకటేశ్వర్లు నాయక్, సిబ్బంది సూర్యారావు, సలీమ్, జీవన్‌రెడ్డి, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కలిగి ఉండాలి

సత్తెనపల్లి: చెత్త నుంచి సంపద తయారీపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో మంగళవారం పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ అంశాలపై మండలంలోని 12 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణలోని అంశాలను ప్రతి ఒక్కరూ తమ తమ గ్రామ పంచాయతీలో అమలు చేయాలన్నారు. మండల విస్తరణ అధికారి ఏ శ్రీనివాసరెడ్డి, గుంటూరు జిల్లా పరిషత్ నుంచి వచ్చిన డీపీఆర్సీ డి.నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ ఎస్‌బీఎం విజయ లలిత, ఐటీసీ రిసోర్స్ పర్సన్ చెంబేటి బొల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో సైన్స్ దినోత్సవం



విద్యార్థినికి బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ ఝాన్సీస్పృహలత, బుల్లిబాబు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడులో గల కేజీబీవీ పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైన్స్ పితామహుడు సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీస్పృహలత మాట్లాడుతూ మన దైనందిన జీవితంతో సైన్స్ ముడిపడి ఉందన్నారు. వినూత్నమైన ఆలోచనలు, సృజనాత్మకత కలిగి ఉంటే ఎలాంటి ప్రయోగాలైనా చేయవచ్చన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణానికి సైన్స్‌ను ఉపయోగించుకోవాలన్నారు. సైన్స్ పట్ల ఆసక్తిని పెంచే విధంగా విద్యార్థినుల ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ నెహ్రూ యువ కేంద్రం గుంటూరు వారి సౌజన్యంతో వేస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. అనంతరం నమూనాలను తయారు చేసిన విద్యార్థినులను అభినందిస్తూ వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్ ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది ఇజ్రాయిల్ హత్య దారుణం



కోర్టు ఆవరణలో న్యాయదేవత విగ్రహం వద్ద నిరసనలో న్యాయవాదులు

సత్తెనపల్లి: హైదారాబాద్ రంగారెడ్డి న్యాయస్థానంలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని దస్తగిరి అనే కరెంట్ పని చేసే వ్యక్తి హత్య చేయడం దారుణమని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. న్యాయవాద పరిరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్క్‌రావు అధ్యక్షతన మంగళవారం నాలుగు న్యాయస్థానాల్లోని న్యాయవాదులు విధు లు బహిష్కరించారు. దస్తగిరి అనే వ్యక్తి ఒక మ హిళను తీవ్రంగా వేధించటం వలన ఆమె న్యా యవాది ఇజ్రాయిల్‌ను ఆశ్రయించటంతో కేవలం ఇజ్రాయిల్ ఆమెకు న్యాయ సేవలు అందిస్తున్నాడన్నారు. ఈ అక్కసుతో సదరు దస్తగిరి న్యాయవాది ఇజ్రాయిల్‌ను అతి దారుణంగా హత్య చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. దస్తగిరిని కఠినంగా శిక్షించాలని, న్యాయవాద పరిరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు చిట్టా విజయ భాస్కర రెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, బీఎల్ చిన్నయ్య, చిన్నం మణిబాబు, చావా బాబురావు, జూపల్లి శేషయ్య, రాజవరపు నరసింహారావు, బుతుకూరి రామిరెడ్డి, బుర్రి సైదయ్య, తవ్వా హరినాథ్, షేక్ జానీ ఖాజావలి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సోమయాజులు



పెదకూరపాడు: మండల ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఎంపీడీవోగా కార్యాలయ పరిపాలనా అధికారి నాగం సోమయాజులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పనిచేసిన పోకూరి రామకృష్ణ బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రానికి గెజిటెడ్ ఫ్యాకల్టీగా కొలువు పొందటంతో మంగళవారం రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



టీడీపీ సభ్యత్వ కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని పార్టీ శ్రేణులకు కార్డులను అందించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రతి 60 మంది ఓటర్లకు ఒక సారథి ఉంటారని, వారికి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయటంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు కార్పొరేషన్ రుణాల క్రెడిట్ క్యాంప్

క్రోసూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎంపీడీవో జి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున క్రోసూరు మండల పరిధిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో క్రెడిట్ క్యాంపుకు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.